సాగుబాటలో అన్నదాతలు

- బోధన్ నియోజకవర్గంలో ఊపందుకున్న ఖరీఫ్ సాగు పనులు
- నియోజకవర్గంలో లక్షా 8వేల ఎకరాల్లో పంటల సాగుకు అవకాశం
- 89వేలకు పైగా ఎకరాల్లో సాగవనున్న వరి పంట



అచన్‌పల్లిలో నారుమడి



ఎడపల్లి మండలకేంద్ర శివారులో వరినారు వేసేందుకు దమ్ము చేస్తున్న రైతు

బోధన్‌రూరల్ : బోధన్ నియోజకవర్గంలో తొలకరి వర్షాలు అనుకూలించడంతో ఎడపల్లి, రెంజల్, నవీపేట, బోధన్, సాలూర మండలాల్లో రైతులు, వ్యవసాయ కూలీలు సాగు పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. వరి పంటను సాగు చేసే రైతులు ఇప్పటికే తమ పొలాల్లో వరి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ముందస్తుగా సాగు పనులు ప్రారంభించిన రైతులు వరినాట్లు వేయడం పూర్తి చేశారు. బోధన్ వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో వానాకాలం సీజన్‌లో లక్ష 8 వేల ఎకరాల్లో పంటలు సాగు అయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈసీజన్‌లో నియోజకవర్గంలో అత్యధికంగా రైతులు 89,136 ఎకరాల్లో వరి పంట, 17,882 ఎకరాల్లో సోయా, 592 ఎకరాల్లో పత్తి, 384 ఎకరాల్లో కంది, 85 ఎకరాల్లో మినుము, 71 ఎకరాల్లో పెసర్లు, 53 ఎకరాల్లో మొక్కజొన్న పంటలను రైతులు సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. పామాయిల్, ఉద్యానవన పంటలు 3 నుంచి 5వేల ఎకరాల్లో సాగవనున్నాయి. ఈ సీజన్‌లో పంటల సాగు కోసం 18 నుంచి 20 వేల మెట్రిక్ టన్నుల యూరియా, 6 నుంచి 8 వేల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అవసరముంటుందని వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. అవసరం మేరకు ఎరువులను అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

25 ఎకరాల్లో సాగు చేస్తున్నాను



ఈ సీజన్‌లో సొంతం పొలం 5 ఎకరాలతో పాటు 20 ఎకరాలు కౌలు తీసుకుని వరి పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పొలాలను దమ్ము చేసుకుని వరినాట్లు వేయడం ప్రారంభించాను. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆశిస్తున్నాను.

– తమ్మయ్యగారి నవీన్, యువరైతు, బర్దీపూర్

అధికారుల సూచనలు పాటించాలి



అన్నదాతలు పంటల సాగు విషయంలో వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలి. రైతుల అవసరం మేరకు విత్తనాలు, ఎరువుమందులు అందుబాటులో ఉంచుతాం. ఈసీజన్‌లో రైతులు మంచి దిగుబడులు సాధించేందుకు కృషి చేస్తాం.

– యంఏ. అలీం హైమద్, ఏడీఏ, బోధన్

నేటి చిత్రం



కూలిన కల్వర్టు సైడ్‌వాల్

బోధన్: పట్టణ కేంద్రం నుంచి బాన్సువాడ వెళ్లే ప్రధాన మార్గంలో విజయమేరి హైస్కూల్ సమీపంలో కల్వర్టు సైడ్‌వాల్ కూలిపోయి ప్రమాదకరంగా ఉంది.కల్వర్టు పక్కన లోతైన గుంత ఉంది. వాహనదారులు ఏమరపాటుగా డ్రైవింగ్ చేస్తే గుంతలో పడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు. – ఎం. రాజ్‌కుమార్, బోధన్

మాకు ఫొటో పంపండి — మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్ : 99636 95349

రెజ్లింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



రుద్రూర్ హైస్కూల్ విద్యార్థులు

రుద్రూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రెజ్లింగ్ పోటీలో ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్‌లోని యాకుత్‌పూర్‌లో జరిగిన అండర్–15 రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలో పాఠశాల చెందిన సువేణి, అభిరాజ్, విజశ్రీలు తమ సత్తాను చాటారు. సువేణి గోల్డ్ మెడల్, అభిరాజ్ సిల్వర్, విజయశ్రీ బ్రాంజ్ సాధించినట్లు పాఠశాల ఉపాధ్యాయులు వెల్లడించారు. విద్యార్థులను ఎంఈవో కట్ట శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. గోల్డ్ మెడల్ సాధించిన సువేణి పుణేలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలో పాల్గొననుందని వారు వెల్లడించారు.

క్లుప్తంగా

కూలిన పాఠశాల ప్రహరీ



డొంకేశ్వర్(ఆర్మూర్): ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని నూత్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ప్రహరీ కూలింది. ప్రహరీ పాతది కావడంతో కొంత భాగం కూలింది. పడిపోయింది. స్థానికంగా ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ప్రహరీకి మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శాకాహారం శ్రేయస్కరం



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని వెల్మల్ గ్రామంలో పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ మూమెంట్ ఆఫ్ ఇండియా(పీఎస్‌ఎస్‌ఎం) ఆధ్వర్యంలో ఆదివారం అహింసాయుత మహా కరుణ శాకాహార ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో తిరుగుతూ మూగజీవాలను సంరక్షించాలని, శాఖహారం శ్రేయస్కరమని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మూన్నూర్ కాపు సంఘంలో ఏర్పాటు చేసిన ధాన్యజ్ఞాన కార్యక్రమంలో పీఎస్‌ఎస్‌ఎం జిల్లా అధ్యక్షులు సాయికృష్ణరెడ్డి మాట్లాడారు.పీఎస్‌ఎస్‌ఎం ఉపాధ్యక్షులు మామిడి లక్ష్మారెడ్డి, ప్రధాన సలహాదారుడు బొడ్డు దయానంద్, గోవూర్ ఒడ్డెన్న యాదవ్, మల్లారం సాయినాథ్, పిరమిడ్ మాస్టర్లు నాగభూమన్న, కండెల గంగాధర్, సుంకభోజన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కిసాన్, ఎస్సీ మోర్చా అధ్యక్షుల నియామకం



కమ్మర్‌పల్లి: బీజేపీ కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడిగా చౌట్‌పల్లికి చెందిన కుంట రమేష్‌రెడ్డి, ఎస్సీ మోర్చా మండలాధ్యక్షుడిగా చిట్యాల దేవేందర్ నియమితులయ్యారు. ఈమేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి నియామకపు పత్రాలను అందజేశారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, మండలాధ్యక్షుడు బద్దం రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోనసముందర్ వీడీసీ నూతన కార్యవర్గం ఎన్నిక



కమ్మర్‌పల్లి: మండలంలోని కోనసముందర్ గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మెల గంగాధర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా శెట్‌పల్లి గంగాధర్, కోశాధికారి కంతి గంగాధర్, సలహాదారులుగా సామ బాపురెడ్డి, కాలేరు రాజేశ్వర్, చెలిమెల గంగాధర్‌లను ఎన్నుకున్నారు.

ఆర్థిక సాయం



రుద్రూర్ : నిరుపేద విద్యార్థుల చదువు కోసం ఆదివారం కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయాన్ని అందజేసింది. కోటగిరి మండల కేంద్రంలోని వినాయక నగర్ కు చెందిన నిఖిత ములుగు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతోంది. నిఖిత తల్లిదండ్రులు తమ ఆర్థిక ఇబ్బందులను ట్రస్ట్ దృష్టికి తీసుకెళ్లగా రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేశారు. రుద్రూర్ మండలం రాయకూర్ గ్రామానికి చెందిన సాయికుమార్ బాన్సువాడ శశాంక్ కాలేజీలో ఎమ్మెస్‌డబ్ల్యూ చదువుతున్నాడు. ట్రస్ట్ సభ్యులను ఆశ్రయించగా రూ. పది వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కోటగిరి, రుద్రూర్ మండలాల బీజేపీ అధ్యక్షులు వేముల నవీన్ కుమార్ , హరికృష్ణ, వెంకటేష్, మోహన్ రావ్, సాయిలు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్వచ్ఛ కార్యక్రమం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవరణలో గల శ్రీ నాగలింగేశ్వర ఆలయంలో ఆదివారం ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛకార్యాక్రమం చేపట్టారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సుంకే శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టీయూసీఐ మహాసభలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మల్లేశ్

బోధన్ : జిల్లా కేంద్రంలో ఈ నెల 21,22 తేదీలల్లో జరుగనున్న టీయూసీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆయూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బీ. మల్లేశ్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఎడపల్లి మండలంలోని జాన్కంపేట గ్రామంలో మహిళా బీడీ కార్మికులతో కలిసి ఆయన మాట్లాడారు. మహాసభల తొలి రోజు కార్మికులతో భారీ ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని, మరుసటి రోజు యూనియన్ ప్రతినిధులు సమావేశం కొనసాగుతుందన్నారు.పెరుగుతున్న ధరలకనుగుణంగా కనీస వేతనాల సవరణ, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు అంశాలపై మహాసభల్లో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై చర్చ ఉంటుందని వెల్లడించారు. సంఘ సభ్యులు ఓడ్డెవ్వ, లతా, గంగామణి, వనజ, సరోజ,లలిత,వాణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సేవ్ లైఫ్ బ్లడ్ డోనర్ ఫౌండేషన్ సభ్యులకు సన్మానం



సన్మానం చేస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం రాత్రి సేవ్ లైఫ్ బ్లడ్ డోనర్ ఫౌండేషన్ సభ్యులను ఎమ్మెల్యే పైడిరాకేశ్ రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా మనిషి ప్రాణాలను కాపాడినవారవుతామన్నారు. సభ్యులు సేవలను కొనసాగించాలని ఆయన కోరారు. కార్యాక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బినోల బైపాస్‌కు మోక్షం లభించేనా?

- ప్రమాదకర మూలమలుపు..
- ఇరుకైన అంతర్గత రహదారి
- పీఆర్, ఆర్‌అండ్‌బీ అధికారుల మధ్య సమన్వయం లోపం..



ప్రమాదకరంగా ఉన్న బినోల మూల మలుపు

నవీపేట : మండలంలోని బినోల గ్రామ ఊళ్లోకి వెళ్లే ముందు గల ప్రధాన ముఖద్వారం ప్రమాదకరంగా మారింది. ఇరుకైన చెరువుకట్ట మీది నుంచి జాగ్రత్తగా వచ్చే ప్రయాణికులు, గ్రామస్థులు అక్కడి నుంచి మళ్లీ ఊళ్లోకి వెళ్లాలంటే భయపడతున్నారు. ఎత్తైన ప్రమాదకర మూలమలుపు నుంచి మెల్లిగా దిగాల్సి వస్తుంది. అక్కడ దిగాక మళ్లీ ఊళ్లో వాహనం నడపాలంటే ఇరుకుగా ఉన్న రహదారితో ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి వెంట నాళేశ్వర్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సు వెళ్తుంది.ఈమూల మలుపు దగ్గర పలుమార్లు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదకర మూల మలుపు, ఇరుకైన రోడ్డు వంటి సమస్యలను పదేళ్ల కిందట అప్పటి ఎమ్మెల్యే షకీల్‌కు గ్రామస్థులు విన్నవించారు. గాంధీనగర్ నుంచి నాళేశ్వర్, నందిగామ గ్రామాలకు వెళ్లే వాహనాలు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బైపాస్ రోడ్డును ప్రస్తావించారు. చెరువు కట్ట మీద నుంచి ఊళ్లోకి కాకుండా నిదానంగా ఊరి చివరి వరకు బైపాస్‌ను విస్తరించాలని అప్పట్లో ఆర్‌అండ్‌బీ, పీఆర్ అధికారులను ఆదేశించారు. సర్వే పూర్తి చేసిన అధికారులు నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించారు. ఇప్పటి వరకు ఎలాంటి ప్రస్తావన రాలేదు. బైపాస్ రోడ్డు నిర్మాణంతో ఇబ్బందులు తొలగుతాయని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

మా పరిధిలోకి రాదు

గాంధీనగర్ నుంచి బినోల వరకు ఆ తరువాత ఊరి బయట నుంచి నాళేశ్వర్ వరకు విస్తరించుకున్న రహదారి ఆర్‌అండ్‌బీలోకి వస్తుందని సంబంధిత శాఖ అధికారులు పేర్కొన్నారు. బైపాస్ విషయమై అధికారులను సంప్రదించగా గ్రామంలోని రహదారి మా పరిధిలోకి రాదని తేల్చి చెప్పారు. ఈ విషయమై పీఆర్ అధికారులను వివరణ కోరగా ఆ మొత్తం ఆర్‌అండ్‌బీ పరిధిలోకి వస్తుందని, తమకెలాంటి సంబంధ లేదని సమాధానమిచ్చారు. రెండు శాఖల అధికారుల సమన్వయలోపంతో సమస్యకు పరిష్కారం లభించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

సంక్షిప్తం

నేడు దివ్యాంగుల సమావేశం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని మార్కెట్ యార్డు కారాల్యయ ఆవరణలో సోమవారం దివ్యాంగుల సమావేశం నిర్వహిస్తున్నట్లు స్నేహా దివ్యాంగుల వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్ : పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని హనుమాన్ గల్లి దుర్గాదేవి కల్యాణ మండపం వద్ద ఆదివారం శ్రీ దత్త మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య పరీక్షలు జరిపి అవసరమైన మందులను వైద్యులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో..

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆదివారం మెట్‌పల్లి సిరి చిల్డ్రన్స్ హాస్పిటల్, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈశిబిరంలో ప్రముఖ పిల్లల వైద్యులు డాక్టర్ చిలుక చైతన్య వైద్య సేవలందించారు. 80 మంది చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఎంఎల్ నాయకుడికి సంతాపం

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనసముందర్ గ్రామానికి చెందిన సీపీఐ ఎంఎల్ పార్టీ రైతాంగ కార్మిక నాయకుడు అంబల్ల శ్రీనివాస్ సంతాప సభ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, ఐఎఫ్‌టీయూ (న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశ్, రాష్ట్ర నాయకులు వొల్లాల కిషోర్, దశరథం, రవీందర్, మారుతి, సత్యనారాయణ తదితరులు హాజరై శ్రీనివాస్‌కు నివాళులు అర్పించారు. శ్రీనివాస్ రైతాంగ ఉద్యమాలకు అందించిన సేవలను స్మరించుకున్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం



కిసాన్‌నగర్‌లో గంగనీళ్లను తీసుకెళ్తున్న గ్రామస్తులు



గంగనీళ్లను తీసుకువస్తున్న నాగంపేట్ వాసులు



జలాభిషేకానికి వెళ్తున్న సర్వసమాజ్ సభ్యులు

బాల్కొండ/ఆర్మూర్‌టౌన్/వేల్పూర్ : బాల్కొండ మండలం కిసాన్ నగర్, ముప్కాల్ మండలం నాగంపేట్ గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. గ్రామపెద్దలు ముందుగా గోదావరి నదికి కాలినడకన వెళ్లి గంగ నీళ్లను తీసుకొచ్చారు. అనంతరం వలగొడుగుతో వెళ్లి గ్రామాల్లోని ముత్యాలమ్మ, వెంకటేశ్వర, పోశవ్వ, తాతాయి, హనుమాన్, రామాలయాల్లో దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. ప్రతి ఏడాది జూన్‌లో గ్రామదేవతలకు జలాభిషేకం చేయడం ఆనవాయితీ అని గ్రామపెద్దలు తెలిపారు. ఈకార్యక్రమంలో వీడీసీ,గురడి రెడ్డి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఆర్మూర్‌పట్టణంలో సర్వసమాజ్ ఆధ్వర్యంలో గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించారు. పట్టణంలోని నల్లపోచమ్మ, మహాలక్ష్మి ఆలయం, ముత్యాలమ్మ ఆలయంలోని దేవతలకు జలాభిషేకం చేశారు. పాడిపంటలు సంవృద్ధిగా పండాలని, పట్టణ ప్రజలు సుఖసంతోషలతో ఉండాలని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్వసమాజ్ అధ్యక్షుడు కొట్టాల సుమన్, ప్రధానకార్యదర్శి కర్తన్ దినేష్, కోశాధికారి రవి, క్యాషియర్ తెడ్డుబాల్‌రెడ్డి, గుండు సాయన్న, పుప్పాల గిరి, గొర్తె దేవేందర్, లోక దశరథ్ తదితరులు పాల్గొన్నారు. వేల్పూర్ మండలం పడగల్ గ్రామంలో స్థానిక వీడీసీ ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు గోదావరి నీటితో జలాభిషేకం నిర్వహించారు. గంగపుత్రుల వలగొడుగు డప్పువాయిద్యాలతో స్థానిక రామాలయం, బ్రహ్మంగారి ఆలయం, గంగమ్మతల్లి, పోచమ్మ, ముత్యాల పోచమ్మ, ఐదు చేతుల పోచమ్మ ఆలయాల్లో గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు.



పడగల్‌లో వలగొడుగుతో వెళ్తున్న గ్రామస్తులు

నాళేశ్వర్‌లో బోనాల పండుగ

నవీపేట: మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో ఆదివారం గ్రామస్తులు బోనాల పండుగ నిర్వహించారు. బోనాలను తలపై ఎత్తుకుని గ్రామంలోని దేవతామూర్తులకు నైవేద్యాలు సమర్పించారు.



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

నీట్‌లో మెరిసిన పెర్కిట్ విద్యార్థిని



పెర్కిట్(ఆర్మూర్) : నేషనల్ ఎలిజిబిటీ కమ్ ఎంట్రన్స్‌టెస్టు ఫలితాల్లో ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌కు చెందిన బచ్చేవాల్ శ్రేష్ఠ అఖిలభారత స్థాయిలో 1,978 ర్యాంకు, ఓబీసీ విభాగంలో 654 ర్యాంకు సాధించింది. పెర్కిట్‌కు చెందిన శ్రేష్ఠ హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య కళాశాలలో బైపీసీ విభాగంలో ఇంటర్ పూర్తి చేసింది. 15 రోజుల క్రితం విడుదల చేసిన ఈఏపీ సెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 15వ ర్యాంకు సాధించింది. కూతురుకి జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకు రావడంపై తల్లి తండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కోటగిరి విద్యార్థినికి.. 3161 ర్యాంకు



రుద్రూర్: కోటగిరి మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ బీర్కూర్ గంగాధర్ మనుమరాలు బీర్కూర్ సంజన నీట్‌లో ఆల్ ఇండియా 3161 ర్యాంకు సాధించింది. సంజన హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేసింది. తండ్రి మధుకర్, తల్లి లావణ్య సంజన మంచి ర్యాంకు సాధించడంపై సంతోషం వ్యక్తం చేశారు.

నిర్మాణానికి నోచుకోని వంతెనలు



జాన్కంపేట్ సమీపంలో గతేడాది భారీ వరదకు ధ్వంసమైన రహదారి (ఫైల్)

- రహదారులకు పొంచి ఉన్న వరద ముప్పు

వేల్పూర్ : మండలంలోని జాన్కంపేట్, మోతె గ్రామాల వద్ద ఆర్‌అండ్‌బీ రహదారులపై గత ప్రభుత్వం తలపెట్టిన వంతెనలు నిర్మాణానికి నోచుకోవడం లేదు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రూ. 40 లక్షల అంచనా వ్యయంతో రెండు చోట్ల వంతెనలను రెండేళ్ల క్రితం మంజూరు చేయించారు. వెంటనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పనులు జరుగలేదు. ఆర్మూర్ నుంచి జాన్కంపేట్ మీదుగా ఆర్మూర్‌కు, భీమ్‌గల్‌కు, వేల్పూర్ మోతె గ్రామాల మీదుగా రెండు వైపుల నుంచి వేలాది వాహనాలు నిత్యం ప్రయాణిస్తుంటాయి. భారీ వరదవచ్చి రహదారులు తెగిపోతే జాన్కంపేట్ మీదుగా ఆరు గ్రామాలకు, మోతె మీదుగా ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. వరద ముప్పుతో రహదారులు తెగిపోకముందే వంతెనలు నిర్మించాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో ఆదివారం దివ్యాంగులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దివ్యాంగుల వివాహ ఖర్చులకు గాను రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 వేల నుంచి రూ.లక్ష పెంచినందుకు గాను హర్షం వ్యక్తం చేస్తూ పాలాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, దమ్మాయి శీను, మాన్పూర్ భూమేష్, నిఖిల్, వికలాంగ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు ఎస్ లక్ష్మి, కలీం, సాగర్, ముత్యం, సుదర్శన్, భారతి తదితరులు పాల్గొన్నారు.